సాక్షి వరంగల్

మంగళవారం । 10 । జనవరి । 2023



విద్యుత్‌ బిల్లుల ఆదాకు సోలార్‌

విద్యుత్‌ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. దీనికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం రాయితీపై సోలార్‌ విద్యుత్‌ పరికరాలను అందిస్తుంది. - 8లో▸

మీదికొండలో అరుదైన భైరవ శిల్పం



జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌ మండలం మీదికొండలో నాలుగు చేతులు కలిగిన అరుదైన భైరవ శిల్పం ఉన్నట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. - 8లో▸

గరిష్టం/కనిష్టం
25.0^0 /14.0^0

వాతావరణం

జిల్లాలో వాతావరణం ఆహ్లాదకరంగా ఉంటుంది. పొగమంచు కారణంగా ఉదయం, రాత్రి చలి తీవ్రత అధికంగా ఉంటుంది. చల్ల గాలులు వీస్తాయి.

న్యూస్‌రీల్‌

బృహత్‌ వనాలు ఏర్పాటు చేయాలి

డీఆర్‌డీఏ ఏపీడీ సాయిచరణ్‌



గీసుకొండ: మండలంలోని కొనాయమాకుల, గీసుకొండ, శాయంపేట గ్రామాల్లో బృహత్‌ పల్లె ప్రకృతి వనాలను ఏర్పాటు చేయాలని డీఆర్‌డీఏ అడిషనల్‌ ప్రాజెక్టు డైరెక్టర్‌ వీరమల్ల సాయిచరణ్‌ అన్నారు. సోమవారం ఆయా గ్రామాల్లో బృహత్‌ వనాల ప్రతిపాదిత స్థలాలను ఆయన పరిశీలించి సంబంధిత సర్పంచ్‌లు, ఈజీఎస్‌ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులకు సూచనలు చేశారు. రెండు రోజుల్లో వనాల ఏర్పాటు పనులను ప్రారంభించాలన్నారు. జాబ్‌కార్డు దారులకు ఆధార్‌ అనుసంధానంతో పాటు ప్రత్యేక యాప్‌లో కూలీల హాజరు నమోదు చేయాలన్నారు. ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓ వద్దూరి ప్రవీణ్‌కుమార్‌, ఎంపీఓ ప్రభాకర్‌, ఏపీఓ చంద్రకాంత్‌, సర్పంచ్‌ డోలె రాధాబాయి, దొడు బాబు, రాజబోయిన రజిత, ఈసీ శ్రీలత, టీఏ సుష్మ, పంచాయతీ కార్యదర్శులు ఎన్‌. వేణుప్రసాద్‌, నరేశ్‌, రవికర్‌బాబు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.

నల్లబెల్లిలో..

నల్లబెల్లి: బృహత్‌ పల్లె ప్రకృతి వనాల నిర్మాణాలు చేపట్టేందుకు అధికారులు, ప్రజాప్రతినిధులు కృషి చేయాలని జెడ్పీ సీఈఓ సాహితి మిత్ర అన్నారు. మండలంలోని కొండాపూర్‌, గోవిందాపూర్‌ గ్రామాల్లో బృహత్‌ పల్లె ప్రకృతి వనాల నిర్మాణం సోమవారం స్థల పరిశీలన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి మండలంలో నాలుగు పల్లె ప్రకృతి వనాలు నిర్మించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డీఆర్‌డీఓ ప్లాంటేషన్‌ జిల్లా మేనేజర్‌ రమేష్‌, ఎంపీడీఓ విజయ్‌ కుమార్‌, సర్పంచ్‌లు గూబ రజిత, కరివేదుల వెంకట్‌ రెడ్డి, పంచాయతీ కార్యదర్శులు శాంత, రజిత తదితరులు పాల్గొన్నారు.

‘అటల్‌ రోబోటిక్‌’లో తృతీయ బహుమతి

సంగెం: వరంగల్‌లోని ప్లాటినం జూబ్లీ హైస్కూల్‌లో ఆదివారం రాత్రి జరిగిన అటల్‌ రోబోటిక్‌ పోటీల్లో మండలంలోని గవిచర్ల మోడల్‌ స్కూల్‌ విద్యార్థులు తృతీయ బహుమతి పొందినట్లు ప్రిన్సిపాల్‌ ఎండీ.ముజుబూర్‌ రహమాన్‌ తెలిపారు. పాఠశాలకు చెందిన ఇ.వర్షిత్‌, టి.అభినవ్‌లు తయారు చేసిన రోబోటిక్‌ ప్రాజెక్టు ‘బోరు బావిలో పడిన చిన్నారులను కాపాడడం’ అనే అంశంపై తృతీయ బహుమతి రూ.3000లు, ప్రశంస పత్రం పొందారన్నారు. ఈ మేరకు సోమవారం గెలుపొందిన విద్యార్థులను ప్రిన్సిపాల్‌ అభినందించారు.

బీవీహెచ్‌పీఎస్‌ జిల్లా అధ్యక్షుడిగా షరీఫ్‌



వర్ధన్నపేట: భారత వికలాంగుల హక్కుల పరిరక్షణ సమితి(బీవీహెచ్‌పీఎస్‌) జిల్లా అధ్యక్షుడిగా మండలంలోని ఇల్లంద గ్రామానికి చెంది ఎండీ షరీఫ్‌ను నియమించినట్లు రాష్ట్ర అధ్యక్షుడు గిద్దె రాజేష్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా షరీఫ్‌ మాట్లాడుతూ తన నియామకానికి సహకరించిన ప్రతి ఒక్కరికి కృతజ్ఞతలు తెలిపారు. తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా వికలాంగుల పరిరక్షణ కోసం పాటు పడతానన్నారు. సంఘం బలోపేతానికి కృషి చేస్తానన్నారు.

ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ప్రొవిజనల్‌ లిస్టు

గీసుకొండ: జిల్లాలో వైద్య ఆరోగ్యశాఖ పరిధిలో కాంట్రాక్టు పద్ధతిపై నియమించనున్న 38 ఎంఎల్‌హెచ్‌పీ పోస్టులకు ప్రొవిజనల్‌ లిస్టు సిద్ధమైందని డీఎంహెచ్‌ఓ డాక్టర్‌ కె. వెంకటరమణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా వెబ్‌సైట్‌(వరంగల్‌.తెలంగాణ.జీఓవీ. ఇన్‌)లో లిస్టు పొందుపరిచామని,అభ్యంతరాలు ఉంటే ఈనెల10న డీఎంహెచ్‌ఓ కార్యాలయంలో సాయంత్రం 5లోపు తెలపాలని కోరారు.

19న పోస్ట్‌ మెట్రిక్‌ స్కాలర్‌షిప్‌లపై సమీక్ష

వరంగల్‌ రూరల్‌: జిల్లాలోని ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సంక్షేమ శాఖలకు చెందిన పోస్టు మెట్రిక్‌ స్కాలర్‌షిప్‌లపై ఈ నెల 19న కలెక్టరేట్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌లో కలెక్టర్‌ గోపి అధ్యక్షతన సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు జిల్లా గిరిజన సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్‌ షేక్‌ జహీరుద్దీన్‌ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. విద్యార్థులు పోస్టు మెట్రిక్‌ స్కాలర్‌షిప్‌ల దరఖాస్తు ప్రక్రియ, మంజూరు, పెండింగ్‌ స్కాలర్‌ షిప్‌లపై సమీక్షిస్తారన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేట్‌ కళాశాల ప్రిన్సిపాళ్లు విదార్థుల పూర్తి వివరాలతో హాజరు కావాలని కోరారు.

ఎక్సైజ్‌కు నకిలీ చలాన్లు!

వర్ధన్నపేట కేంద్రంగా మరోమారు ఫేక్‌ చలాన్లు

- లైసెన్స్‌ లీజ్‌ పీరియడ్‌ రూ.22 లక్షలు కట్టని వైనం
- గతంలోనూ సర్కార్‌కు రూ.కోట్లలోనే ఎగనామం
- వర్ధన్నపేట ఠాణాలో ఉన్నతాధికారి ఫిర్యాదుతో వెలుగులోకి..
- ముఖ్య సూత్రధారితో సహా మరో 11మందికి సంకెళ్లు
- బ్యాంక్‌ ఉద్యోగిని కూడా అదుపులోకి తీసుకున్న పోలీసులు



సాక్షి, వరంగల్‌: ఎక్సైజ్‌ శాఖ నిర్వహించిన వైన్‌ షాపుల వేలంలో పాల్గొనాలంటే ఒక్కో దరఖాస్తు దారుడు రూ.రెండు లక్షలు చెల్లించాలి. ఓ బ్యాంక్‌ అధికారి సహాయంతో నకిలీ చలాన్లు సృష్టించిన ఓ ముఖ్య వ్యక్తి.. అతని బినామీలుగా మరో 11 మంది ఎంచక్కా పైసా కట్టకుండానే సర్కార్‌ నిర్వహించిన బ్రాందీషాప్‌ల వేలంలో పాల్గొన్నారు. ఫలితంగా ప్రభుత్వానికి లైసెన్స్‌ లీజ్‌ పీరియడ్‌ చలాన్ల రూపంలో రావాల్సిన రూ.22 లక్షల నగదు ట్రెజరీలో జమ కాలేదు. ఇంతకీ విషయం ఏమిటంటే.. 2022 నవంబర్‌ 25 నుంచి డిసెంబర్‌ మూడు వరకు వరంగల్‌ రూరల్‌ జిల్లా ప్రొహిబిషన్‌ అండ్‌ ఎక్సైజ్‌ అధికారి కార్యాలయంలో 2019–21 ఏ ఫోర్‌ షాప్‌ ఎక్సైజ్‌ లైసెన్స్‌ లీజ్‌ పీరియడ్‌కు సంబంధించిన రూ.20 లక్షల చలాన్లు రెవెన్యూ రీ కాన్సిలేషన్‌, ట్రెజరీ అకౌంట్‌లో జమకాలేదని తేలింది. 2019 అక్టోబర్‌ 11 నుంచి 14 మధ్యలో వర్ధన్నపేట ఎస్‌బీఐ బ్రాంచ్‌ ద్వారా ఈ చలాన్‌ వచ్చినట్టుగా ఎక్సైజ్‌ శాఖ విచారణలో తేలింది. బ్యాంక్‌ ఉద్యోగి ఎం.సీతారం తన బ్యాంక్‌ ముద్ర, సంతకాలను చేసినట్టుగా గుర్తించారు. దీనిపై వర్ధన్నపేట పోలీస్‌స్టేషన్‌లో ఎక్సైజ్‌ ముఖ్య అధికారి ఫిర్యాదు చేసినట్టు సమాచారం. ఈ మేరకు ఇప్పటికే దీనికి ముఖ్య సూత్రధారి భరత్‌తో పాటు బ్యాంక్‌ ఉద్యోగి సీతారాం, మరో 10 మందిపై చీటింగ్‌ కేసు నమోదు అయినట్లు తెలిసింది. అయితే రెగ్యులర్‌ తనిఖీల్లో ఇవి ఇక్కడి అధికారులు గుర్తించకపోవడంతో నిందితులతో ఏమైన ములాఖత్‌ అయ్యారనే దిశగా మరోమారు విచారణ సాగుతోంది.

రెంటల్‌ ఫీజులోనూ..

2019 నుంచి 2021 వరకు వర్ధన్నపేటలోని నాలుగు వైన్‌షాప్‌ నిర్వాహకులు దాదాపు 20 డమ్మీ చలాన్లతో రూ.రెండు కోట్లకుపైగా ప్రభుత్వాన్ని ఛీట్‌ చేశారు. బ్యాంక్‌లో డబ్బులు జమ చేయకుండానే సిబ్బంది సహకారంతో స్టాంప్‌ వేయించి ఎక్సైజ్‌ శాఖ ట్రెజరీలో అప్పగించడం సంచలనం సృష్టించింది. గతేడాది జనవరి 7న నకిలీ చలాన్లతో రూ.68.75 లక్షలు, చంద్రమౌళి వైన్‌షాప్‌ నుంచి రూ.63.75 లక్షల ఐదు ఫేక్‌ చలాన్లు ఎక్సైజ్‌ అధికారుల విచారణలో తేలింది. అంతకుముందు రెండు నెలల క్రితం సింగం వైన్స్‌ లైసెన్స్‌ రెన్యూవల్‌ పేరిట 1,13,76,660 డమ్మీ చలాన్లు సృష్టించినట్టుగా తేల్చారు. ఇలా దాదాపు రూ.2 కోట్ల ఎక్సైజ్‌ శాఖ ఆదాయానికి గండి కొట్టారు. అయితే అప్పటి ఎక్సైజ్‌ అధికారులు కేవలం రెంటల్‌ ఫీజుకు మాత్రమే పరిమితం అయ్యారు. ప్రతిఏటా ఒక్కో వైన్‌షాప్‌ ఏడాదికి రూ.55 లక్షల వరకు రెంటల్‌ ఫీజు చెల్లించాలి. అయితే రెంటల్‌ ఫీజులోనూ నకిలీ చలాన్లు అని తేలడంతో అప్పుడు ఎక్సైజ్‌ సీఐతో పాటు మరికొందరిపై చర్యలు తీసుకున్న సంగతి తెలిసిందే. ఇటీవల జరిగిన ఏజీ ఆడిట్‌లో 2019 అక్టోబర్‌ నాటి ఎక్సైజ్‌ లైసెన్స్‌ పీరియడ్‌లో 11 చలాన్ల మొత్తం రూ.22 లక్షల మోసం జరిగినట్టుగా నిర్ధారించడం గమనార్హం. వీటిని ఎట్టి పరిస్థితుల్లో ట్రెజరీలో జమ చేసేలా చర్యలు తీసుకుంటాం. ఇప్పటికే పోలీసుస్టేషన్‌లో సదరు నిందితులపై ఫిర్యాదు చేశామని ఎక్సైజ్‌ విభాగ ఉన్నతాధికారి లక్ష్మణ్‌ నాయక్‌ తెలిపారు.

ఎలా మోసం చేశారంటే..

వైన్‌షాప్‌ వేలంలో పాల్గొనాలనుకునే వ్యక్తి ఆన్‌లైన్‌లో చలాన్‌ ఎంట్రీ ఫామ్‌కు వెళ్లి సంబంధిత ట్రెజరీ, ఈ సబ్‌ ట్రెజరీతో పాటు డీడీఓ కోడ్‌ ఎంట్రీ చేయాలి. అనంతరం ఆధార్‌కార్డు వివరాలు ఎంట్రీ చేసి ప్రింట్‌ తీసుకోవాలి. ఈ ప్రింట్‌తో పాటు రెండు లక్షల నగదును తీసుకొని వెళ్లి బ్యాంక్‌లో ఈ–చలాన్‌ పేరు మీద డిపాజిట్‌ చేయాలి. ఆ తర్వాత బ్యాంక్‌ సిబ్బంది సంతకంతో కూడిన చలాన్‌ రశీదు ఇస్తారు. ఇది తీసుకొని జిల్లా ఎక్సైజ్‌ కార్యాలయంలో జరిగే టెండర్‌ వేలంలో పాల్గొనాలి. అయితే ఇక్కడ చలాన్‌ ఎంట్రీ ఫామ్‌ తీసుకునే వరకు బాగానే ఉన్నా.. బ్యాంక్‌లో మాత్రం సిబ్బందితో చేతులు కలిపి రూ.రెండు లక్షల డబ్బు కట్టకుండానే రిసీప్ట్‌పై సంతకం చేసి తీసుకున్నారు. ఆ తర్వాత దర్జాగా వేలంపాటలో పాల్గొన్నారు. మూడేళ్ల తర్వాత ఈ మోసాన్ని ఎక్సైజ్‌ అధికారులు గుర్తించారు.

పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

- రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మి

ఖానాపురం: తెలంగాణ ప్రభుత్వం పాఠశాలల్లో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని అడల్ట్‌ ఎడ్యుకేషన్‌ రాష్ట్ర డైరెక్టర్‌ అండ్‌ ఎఫ్‌ఎల్‌ఎన్‌ రాష్ట్ర అబ్జర్వర్‌ విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు మోడల్‌ పాఠశాలలుగా ఎంపికైన మండలంలోని బుధరావుపేట, కొత్తూరు గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలలను సందర్శించారు. ఈ సందర్భంగా మన ఊరు–మన బడి కింద జరుగుతున్న పనులను పరిశీలించారు. పనులు త్వరగా పూర్తి అయ్యే విధంగా చర్యలు చేపట్టాలన్నారు. అలాగే విద్యార్థుల పుస్తక పఠనాన్ని పరిశీలించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో ప్రైవేట్‌కుదీటుగా బోధనలు చేయాలన్నారు. ప్రైవేట్‌ కంటే ఆధునికంగా ప్రభుత్వ పాఠశాలలను తీర్చిదిద్దుకోవడానికి మన ఊరు–మన బడి తోడ్పాటునందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో సెక్టోరియల్‌ ఆఫీసర్‌ సుధీర్‌బాబు,ఎంఈఓ రత్నమాల,ఎంఎన్‌ఓ మంగ్యానాయక్‌, సర్పంచ్‌లు కాస ప్రవీణ్‌కుమార్‌,భూస రమఅశోక్‌యాదవ్‌, సీఆర్పీ రమేష్‌, ఎస్‌ఎంసీ చైర్మన్‌లు పాల్గొన్నారు.

చెన్నారావుపేటలో..

చెన్నారావుపేట: మన ఊరు– మన బడి అభివృద్ధి పనులను వేగంగా పూర్తి చేయాలని పాఠశాలల రాష్ట్ర అబ్జర్వర్‌ అధికారిని ఎస్‌.విజయలక్ష్మి అన్నారు. ఈ మేరకు మండలంలోని అమృతండా పాఠశాలలో మన ఊరు– మన బడి అభివృద్ధి పనులను సోమవారం పరిశీలించారు. పాఠశాలల అభివృద్ధికి సర్పంచ్‌లు, ప్రజలు సహకరించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సెక్టోరియల్‌ అధికారి వడపెల్లి సుధీర్‌బాబు, ఎంఈఓ రత్నమాల, ఉపాధ్యాయుడు బానోతు వెంకన్న, సీఆర్పీ బాలు, యాదగిరి పాల్గొన్నారు.



నిర్మాణ పనులను పరిశీలిస్తున్న విజయలక్ష్మి

నర్సంపేటలో..

నర్సంపేట రూరల్‌: మన ఊరు – మన బడి కార్యక్రమ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని రాష్ట్ర పరిశీలకురాలు విజయలక్ష్మీ అన్నారు. నర్సంపేట మండలంలోని ఇటుకాలపల్లి జిల్లా పరిషత్‌ సెంకడరీ పాఠశాలను సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు జిల్లా సెక్టోరియల్‌ అధికారి సుధీర్‌బాబు, సర్పంచ్‌ మండల రవీందర్‌, ఎంపీటీసీల ఫోరం అధ్యక్షుడు బానోత్‌ వీరన్న, ప్రధానోపాధ్యాయులు కొర్ర సారయ్య, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

వండర్‌హాట్‌ @రూ. 36వేలు

వరంగల్‌ రూరల్‌: వరంగల్‌ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌లో సోమవారం వండర్‌హాట్‌ మిర్చి క్వింటాలుకు గరిష్ట ధర రూ.36వేలు, కనిష్ట ధర రూ.30వేలు పలికిందని వరంగల్‌ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్‌ కమిటీ ఉన్నత శ్రేణి కార్యదర్శి బి.వి రాహుల్‌ తెలిపారు. యూఎస్‌ 341 క్వింటాలుకు గరిష్ట ధర రూ.25 వేలు, కనిష్ట ధర రూ.20వేలు పలికిందన్నారు. అలాగే పత్తి క్వింటాలుకు గరిష్ట ధర రూ.8,200, కనిష్ట ధర రూ.7800లు పలికిందన్నారు.

టాస్క్‌ఫోర్స్‌!

ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌తోపాటు మరో ముగ్గురు సస్పెన్షన్‌



సస్పెన్షన్‌కు గురైన ఇన్‌స్పెక్టర్‌ నరేష్‌ కుమార్‌, శ్యాంసుందర్‌, సృజన్‌, సోమలింగం

- మామూళ్ల మత్తుపై సీపీ రంగనాథ్‌ ఆరా..
- విచారణలో మరిన్ని విషయాలు..
- నివ్వెరపోయిన సీపీ, పోలీస్‌ యంత్రాంగం

వరంగల్‌ క్రైం: వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌ పరిధిలో జరిగిన అక్రమాలపై ఉక్కుపాదం మోపేది టాస్క్‌ఫోర్స్‌.. కానీ ఆ విభాగంలోని అధికారుల్లో కొందరు అవే అక్రమాలకు పాల్పడడం... విచారణలో తెలిసిన విషయాలు చూసి నివ్వెరపోయిన పోలీస్‌ కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌ నలుగురిపై సస్పెన్షన్‌ వేటు వేశారు. ఈ విషయం కమిషరేట్‌లో కలకలం రేపింది. టాస్క్‌ఫోర్స్‌ ఇన్‌స్పెక్టర్‌ వి.నరేష్‌కుమార్‌, హెడ్‌ కానిస్టేబుళ్లు పి.శ్యాంసుందర్‌, కె.సోమలింగం, కానిస్టేబుల్‌ బి.సృజన్‌లు బియ్యం దందాతోపాటు మరికొన్నింట్లో అక్రమ వసూళ్లకు పాల్పడినట్లు తేలడంతో సస్పెండ్‌ చేస్తూ సీపీ సోమవారం రాత్రి ఉత్తర్వులు జారీ చేశారు. డిసెంబర్‌ 3న పోలీస్‌ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన ఏవీ రంగనాథ్‌ ముందుగా సొంతింటిని చక్కబెట్టుకోవడం పట్ల ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

అక్రమ వసూళ్లకు వారే సూత్రధారులు

వరంగల్‌ పోలీస్‌ కమిషనరేట్‌లో టాస్క్‌ఫోర్స్‌ ఏర్పడినప్పటినుంచి కొంతమంది సిబ్బందికి ఎలాంటి బదిలీలు లేవు. దీంతో శాఖలోని లొసుగులను ఆసరా చేసుకుని వసూళ్లకు తెరలేపినట్లు సమాచారం. ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించి టాస్క్‌ ఫోర్స్‌ను అడ్డుపెట్టుకుని సస్పెన్షన్‌కు గురైన ఓ హెడ్‌కానిస్టేబుల్‌ ఏకంగా లక్షల రూపాయల వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఆ కానిస్టేబుల్‌కు రూ.10వేల కంటే తక్కువ ఇస్తే వాటిని ముఖంపై విసిరికొట్టేవాడని చెబుతుండేవారు. కొంతకాలంగా వీరిపై వస్తున్న వసూళ్ల ఆరోపణలపై దృష్టి సారించిన సీపీ రంగనాథ్‌ ఆ దిశగా విచారణ జరిపారు. కొందరు అధికారుల అవినీతి బయటపడుతుందని ఆశించిన వారికి టాస్క్‌ఫోర్స్‌లో అది వెలుగుచూడడంతో ఆశ్చర్యానికి గురయ్యారు. రెండు బృందాల్లోని టాస్క్‌ఫోర్స్‌లో కీలకంగా పనిచేసిన ఇద్దరు హెడ్‌ కానిస్టేబుళ్లు ఒకేసారి సస్పెండ్‌ కావడం చూస్తుంటే ఏ స్థాయిలో వసూళ్లు జరిగాయో అర్థం చేసుకోవచ్చు.

వారం రోజుల విచారణ...నలుగురిపై వేటు

పీడీఎస్‌ బియ్యం దందాపై జరిగిన విచారణలో భాగంగా హసన్‌పర్తికి చెందిన ఓ బియ్యం వ్యాపారి, మిల్స్‌కాలనీ పీఎస్‌ పరిధిలో ఉండే మరో వ్యాపారి, ఓ రిపోర్టర్‌ను వారం రోజులపాటు విచారించడంతో నిజాలు వెలుగుచూసినట్లు తెలిసింది. మామూళ్ల వసూళ్లలో కమిషనరేట్‌కు చెందిన అధికారులు పెద్ద సంఖ్యలో ఉండడం గమనార్హం. వరుస సస్పెన్షన్‌ వేట్లతో ఉరికిస్తున్న సీపీ.. రానున్న రోజుల్లో ఎవరిపై చర్యలు హాట్‌టాపిక్‌గా మారింది.

చంటి లోకల్‌.. వసూళ్ల సూత్రధారి ఓ రిపోర్టర్‌

వేటుపడిన టాస్క్‌ఫోర్స్‌ అధికారి ఉన్నతాధికారుల ముందు ‘చంటి లోకల్‌...అధికారులు వస్తారు...పోతారు’ అనే సినిమా డైలాగ్‌ను పదే పదే చెప్పడంతోపాటు తనకు ఓ ఎమ్మెల్యే అండ ఉందని, తనను ఎవరు ఏమీ చేయరనే ధైర్యంతో వసూళ్లకు పాల్పడినట్లు ఆరోపణలు వస్తున్నాయి. ప్రతినెలా లక్షల రూపాయల వరకు వసూళ్లకు పాల్పడినట్లు తెలిసింది. వరంగల్‌ ప్రాంతంలో ఓ యూ ట్యూబ్‌ రిపోర్టర్‌ను మధ్యవర్తిగా పెట్టుకుని పెద్ద మొత్తంలో వసూలు చేసినట్లు విచారణలో వెలుగు చూసింది.

గొలుసు దొంగలొచ్చార్రోయ్‌..!

వరంగల్‌ మహానగరంలో చైన్‌ స్నాచర్ల ముఠా కలకలం

- రైలులో ఇద్దరు, కారులో ముగ్గురు.. కాజీపేట రైల్వేస్టేషన్‌ వద్ద ములాఖత్‌
- అక్కడి నుంచే బృందాలుగా విడిపోయి చోరీలు
- సీసీ పుటేజీల ఆధారంగా ఉత్తరప్రదేశ్‌ వారిగా అనుమానం
- నగరాన్ని జల్లెడ పడుతున్న పోలీసులు



సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులు అనుమానిస్తున్న చైన్‌ స్నాచర్‌లు వీరే.. క్యాబ్‌ దిగాక కాజీపేట రైల్వే స్టేషన్‌ సమీపంలో కాలినడకన...

సాక్షిప్రతినిధి, వరంగల్‌: దొంగతనాలకు పాల్పడేందుకు నంబర్‌ లేని బైక్‌లు.. మహిళ మెడలోని బంగారు గొలుసులు లాక్కెళ్లడమే లక్ష్యంగా పెట్టుకున్న చైన్‌ స్నాచర్ల ముఠా వరంగల్‌ మహా నగరంలోకి ప్రవేశించిందనే ప్రచారం కలకలం రేపుతోంది. దొంగతనాల కోసం మూడు రోజుల క్రితం వరంగల్‌, హనుమకొండ, కాజీపేటతోపాటు శివారు ప్రాంతాలపై ఈ ముఠా దృష్టి పెట్టింది. ఈనెల 7న గీసుకొండ మండలం గంగదేవిపల్లిలో వరంగల్‌–నర్సంపేట ప్రధాన రహదారిని ఆనుకుని ఉన్న ఒక ఇంటి వద్దకు శనివారం సాయంత్రం బైక్‌పై వచ్చిన ఓ వ్యక్తి తాగునీరు అడిగి.. వృద్ధురాలు మేడిద నర్సమ్మ మెడలో నుంచి బంగారు గొలుసు లాక్కుని పరారయ్యాడు. అదేరోజు సంగెం మండలం గవిచర్ల గ్రామంలోని ఓ ఇంటి తాళం పగులగొట్టి బీరువాలోని 12.25 తులాల బంగారు ఆభరణాలను అపహరించారు. కాజీపేట రైల్వేస్టేషన్‌లోనూ గొలుసు దొంగతనాలకు యత్నించారన్న సమాచారంతో పోలీసులు పెద్ద సంఖ్యలో బలగాలను మోహరించి తనిఖీలు ముమ్మరం చేయడంతో పారిపోయారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ

హైదరాబాద్‌, రాచకొండ పరిధిలో 7న అంతర్రాష్ట్ర దొంగలు పింక్‌, అశోక్‌ ఏడుచోట్ల గొలుసు దొంగతనాలకు పాల్పడ్డారు. ఇదే సమయంలో ఉత్తరప్రదేశ్‌కు చెందిన ఐదుగురు వరంగల్‌ నగరంలోకి ప్రవేశించారన్న సమాచారం మేరకు సీపీ ఏవీ రంగనాథ్‌ ఆధ్వర్యంలో పోలీసు బృందాలు అన్ని కోణాల్లో దర్యాప్తు ముమ్మరం చేశాయి. అయితే 7న అప్పటికే కాజీపేట రైల్వేస్టేషన్‌ వద్దకు చేరుకున్న ఇద్దరిని హైదరాబాద్‌ నుంచి మోటారు క్యాబ్‌లో వచ్చిన ముగ్గురు మధ్యాహ్నం కలుసుకోగా గుర్తించినట్లు తెలిసింది. హైదరాబాద్‌ నుంచి దుండగులు వచ్చిన క్యాబ్‌(వ్యాగన్‌ ఆర్‌) వాహనంగా గుర్తించిన పోలీసులు నంబర్‌ తదితర వివరాలు సేకరించినట్లు సమాచారం. ఆ వాహనం బీబీనగర్‌, వెంకటాయపాలెం(కోమళ్ల) టోల్‌ప్లాజాల మీదుగా కాజీపేటకు చేరుకోగా.. ఆ రెండు టోల్‌ప్లాజాలు, కాజీపేట రైల్వేస్టేషన్‌ సమీపంలోని ట్రాఫిక్‌ సిగ్నల్‌ నుంచి స్టేషన్‌ వైపు తిరిగి అక్కడ వారు దిగే వరకు ఆ క్యాబ్‌కు సంబంధించిన పుటేజీలు ఉన్నట్లు తెలిసింది. ఆ తర్వాత బైక్‌ల ద్వారా వెళ్లిన వారు ఏమయ్యారనేది తెలియకపోగా.. సోమవారం ఉదయం 4 నుంచి 8.30 గంటల వరకు పోలీసు బృందాలు వరంగల్‌ నగరాన్ని జల్లెడ పట్టాయి. వరంగల్‌, హనుమకొండ, కాజీపేట ప్రధాన సెంటర్లలో పికెట్లు వేసి వాహనాల తనిఖీ నిర్వహించారు. కాజీపేట ఏసీపీ ఆర్‌.శ్రీనివాస్‌ ఆధ్వర్యంలో పోలీసులు ఎల్కతుర్తి, కమలాపూర్‌, మడికొండ, పరకాల, గీసుకొండ, మామునూరు, ధర్మసాగర్‌ తదితర ప్రాంతాల్లోని గ్రానైట్‌, స్టోన్‌ క్రషర్‌ క్వారీల్లో సోదాలు నిర్వహించారు. అయితే పెద్ద మొత్తంలో పోలీసులు అప్రమత్తం కావడం వల్ల చైన్‌ స్నాచర్ల ముఠా ఇతర ప్రాంతాలకు తరలివెళ్లినట్లు భావిస్తుండగా.. ప్రజలు గుర్తు తెలియని వ్యక్తుల పట్ల అప్రమత్తంగా ఉండాలని పోలీసు అధికారులు కోరుతున్నారు.



సోమవారం ఉదయం నగరంలో వాహనాల తనిఖీ, గ్రానైట్‌ క్వారీలలో సోదాలు చేస్తున్న పోలీసులు



కోమళ్ల టోల్‌ప్లాజా ద్వారా కాజీపేట ట్రాఫిక్‌ సిగ్నల్‌ నుంచి రైల్వేస్టేషన్‌ వరకు దుండగులు ప్రయాణించింది ఈ క్యాబే..

మొత్తం ఐదుగురు.. కాజీపేట స్టేషన్‌ వద్ద డిస్పాచ్‌

వరంగల్‌ నగరంలోకి చైన్‌ స్నాచింగ్‌ ముఠా ప్రవేశించిందన్న సమాచారం మేరకు పోలీసులు అప్రమత్తమయ్యారు. గీసుకొండ, సంగెం ఘటనల వెనుక ఈ గ్యాంగ్‌ ఉందా? అనే కోణంలో పోలీసులు ఆరా తీస్తున్నారు. అయితే నిందితులు తెలుగు మాట్లాడినట్లు చెబుతుండటంతో పలు సందేహాలు వ్యక్తమవుతున్నాయి. కాగా.. చైన్‌ స్నాచర్ల సమాచారం అందుకున్న పోలీస్‌ కమిషనర్‌ ఏవీ రంగనాథ్‌ ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేయగా.. సీసీ కెమెరా పుటేజీల ఆధారంగా నిందితుల కోసం గాలింపు చేపట్టారు. ఈనెల 7న రైలు, రోడ్డు మార్గాల ద్వారా చేరుకున్న ఐదుగురు కాజీపేట రైల్వేస్టేషన్‌ సమీపంలో కలుసుకుని దొంగతనాలకు పథకం రూపొందించి.. అక్కడి నుంచే విడిపోయినట్లు పోలీసులు భావిస్తున్నారు. మూడు మోటార్‌ బైక్‌లను ఆపరేట్‌ చేస్తున్నట్లు గుర్తించారు. ఈ మేరకు కాజీపేట రైల్వేస్టేషన్‌, ఫుట్‌పాత్‌, ట్రాఫిక్‌ సిగ్నల్‌ వద్ద సేకరించిన సీసీ పుటేజీల ఆధారంగా అనుమానితులైన ఐదుగురు వ్యక్తుల ఫొటోలను విడుదల చేశారు. వీరు ఉత్తర ప్రదేశ్‌ రాష్ట్రానికి చెందిన పాత నేరస్తులన్న చర్చ కూడా జరుగుతోంది.

భూ సమస్యలు త్వరగా పరిష్కరించాలి

- కలెక్టర్‌ డాక్టర్‌ బి.గోపి
- ప్రజావాణిలో 80 దరఖాస్తులు

వరంగల్‌ రూరల్‌: జిల్లాలో భూ సంబంధిత దరఖాస్తులు అధికంగా పెండింగ్‌లో ఉన్నాయని, రెవెన్యూ అధికారులు త్వరగా పరిష్కరించాలని కలెక్టర్‌ డాక్టర్‌ బి.గోపి ఆదేశించారు. సోమవారం కలెక్టర్‌ కాన్ఫరెన్స్‌ హాల్‌లో నిర్వహించిన ప్రజావాణిలో ప్రజల నుంచి వినతులు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌ మాట్లాడుతూ భూములకు సంబంధించిన దరఖాస్తులు అధికంగా వస్తున్నాయని, వీటిని మండల, డివిజన్‌ స్థాయిలో రెవెన్యూ అధికారులు క్షేత్రస్థాయిలో దృష్టి సారించి సత్వరమే పరిష్కరించాలన్నారు. సోమవారం నిర్వహించిన గ్రీవెన్స్‌లో 80 దరఖాస్తులు వచ్చాయి. ఈ ప్రజావాణిలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకాడే, శ్రీవత్స, ఆర్డీఓ మహేందర్‌జీ, డీఆర్‌డీఓ సంపత్‌రావు పాల్గొన్నారు.



దరఖాస్తులు స్వీకరిస్తున్న కలెక్టర్‌ గోపి

పట్టాదారు పాస్‌బుక్‌ రాలే ..

నర్సంపేట మండలం బాంజీపేటలో సర్వేనంబర్‌ 197లో 50 సంవత్సరాలుగా రెండు ఎకరాల భూమిని సాగు చేసుకుంటున్నాం. ఇప్పటి వరకు నాకు పట్టాదారు పాస్‌ బుక్‌ రాలేదు. ఉన్నతాధికారులు స్పందించాలి. – పుట్టపాక సాయి ప్రశాంత్‌

డీపీఓగా బాధ్యతల స్వీకరణ

వరంగల్‌ రూరల్‌: జిల్లా పంచాయతీ అధికారి (డీపీఓ)గా కట్కం కల్పన సోమవారం బాధ్యతలు స్వీకరించారు. జిల్లా ఇన్‌చార్జ్‌ డీపీఓ, డీఆర్‌డీఓ సంపత్‌రావు నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు. గతంలో రాయపర్తి, హనుమకొండ, వర్ధన్నపేట, పరకాలలో ఈఓపీఆర్‌డీగా, ఎంపీడీఓగా పనిచేశారు. పదోన్నతిలో భాగంగా జిల్లా డీపీఓగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. బాధ్యతలు స్వీకరించిన అనంతరం కలెక్టర్‌ గోపిని మర్యాద పూర్వకంగా కలిశారు.



బాధ్యతలు స్వీకరిస్తున్న కల్పన

క్లుప్తంగా

అత్తమామలపై అల్లుడి దాడి

మహబూబాబాద్ రూరల్ : కుటుంబ కలహాల నేపథ్యంలో అత్తమామలు, బావమరిదిపై ఆ ఇంటి అల్లుడు దాడి చేసి గాయపర్చిన సంఘటన మండలంలోని వేంనూర్‌లో సోమవారం చోటు చేసుకుంది. రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం..వేంనూర్ గ్రామానికి చెందిన బత్తుల ఉపేందర్, అతడి భార్య ఉమా, కుమారుడు రాకేష్ కలిసి తమ వియ్యపురాలు కామిని పద్మపై దాడి చేశారని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఆ కోపాన్ని మనసులో పెట్టుకుని కామిని పద్మ కుమారుడు అన్వేష్ తన అత్తమామలపై తన ఇద్దరు మిత్రులతో కలిసి దాడి చేసి గాయపర్చాడు. సమాచారం తెలుసుకున్న రూరల్ ఎస్సై అరుణ్‌కుమార్, పీసీలు అమృ, విజయ్‌కుమార్, సంపత్ సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులను చికిత్సనిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు.

రోడ్డు ప్రమాదంలో బీజేపీ నేతకు స్వల్పగాయాలు

స్టేషన్‌ఘన్‌పూర్ : భారతీయ జనతా పార్టీ రాష్ట్ర నాయకుడు మాదాసు వెంకటేష్ రోడ్డు ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన సంఘటన మండలంలోని శివునిపల్లి శివారు నమిలిగొండ రోడ్డు వద్ద చోటు చేసుకుంది. వెంకటేష్ జఫర్‌గడ్ మండలం తిమ్మంపేటలో ఓ ప్రైవేటు కార్యక్రమానికి హాజరై తిరిగి తన కారులో వస్తుండగా నమిలిగొండ రోడ్డులో పెట్రోల్‌బంక్ మూల మలుపు వద్ద కారుకు ఎదురుగా గేదె వచ్చింది. డ్రైవర్ రవి దానిని తప్పించపోయి పక్కనే ఉన్న విద్యుత్‌పోల్‌కు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో కారు ముందు భాగం ధ్వంసం కాగా వెంకటేశ్‌కు స్వల్ప గాయాయ్యాయి. స్థానిక ఎస్ఎస్‌కే ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు.

లారీ డ్రైవర్‌కు ఐదేళ్ల జైలు

బచ్చన్నపేట: జనగామ జిల్లా బచ్చన్నపేట మండలం మొండికుంట సమీపంలో ఇద్దరి మృతికి కారణమైన లారీడ్రైవర్‌కు ఐదేళ్ల జైలు శిక్ష విధించినట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ జనగామకు చెందిన ఇద్దరు ద్విచక్రవాహనంపై వెళ్తున్న వారిని లారీతో ఢీకొట్టి ఇద్దరి మృతికి కారణమైన మహారాష్ట్ర నాందేడ్‌కు చెందిన లారీడ్రైవర్ సాయినాథ్‌వాగ్‌జీగుండ్లకు ఐదేళ్ల జైలుశిక్షతో పాటు రూ.1000 జరిమానా విధిస్తూ జనగామ జిల్లా కోర్టు జడ్జీ శైలజ తీర్పు వెలువరించినట్లు తెలిపారు.

సోలార్‌తో విద్యుత్ బిల్లులు ఆదా

- పర్యావరణకు ఎలాంటి నష్టం లేదు
- పరికరాలకు రాయితీ ఇస్తున్న ప్రభుత్వం

హన్మకొండ : విద్యుత్ ప్రస్తుతం నిత్యావసరంగా మారింది. కరెంటు లేకుండా ఏ పనులు జరిగేలా లేవు. మానవుల మనుగడకు గాలి, నీరు ఎంత అవసరమో. ప్రస్తుత పరిస్థితుల్లో గాలి, నీరు కావాలంటే విద్యుత్ తప్పని సరైంది. ఈ నేపథ్యంలో విద్యుత్ వినియోగం గణనీయంగా పెరుగుతోంది. ఈ థర్మల్, హైడల్ విద్యుత్ ఉత్పత్తికి ప్రత్యామ్నాయంగా ప్రభుత్వం సాంప్రదాయ వనరుల ద్వారా ఉత్పత్తి అయ్యే విద్యుత్ ఉత్పత్తి, వినియోగాన్ని ప్రభుత్వం ప్రోత్సహిస్తోంది. ప్రధానంగా సౌర విద్యుత్ ఉత్పత్తిని ప్రోత్సహిస్తోంది. విద్యుత్ పంపిణీ సంస్థలు నెట్ మీటరింగ్ ద్వారా గ్రిడ్‌కు అనుసంధానం చేస్తున్నాయి. తద్వారా మిగులు విద్యుత్ గ్రిడ్‌కు సరఫరా జరుగుతుంది. సోలార్ విద్యుత్ పరికరాలకు అయ్యే ఖర్చును 36 నెలల్లో తిరిగి రాబట్టుకోవచ్చు.



తరిగిపోని విద్యుత్ వనరుల చిరునామా సౌరవిద్యుత్

ఉషోదయపు కాంతులు విద్యుత్ ఉత్పత్తికి సోలార్ ప్రధాన వనరు. సూర్యకాంతిని ఒడిసిపట్టి, నిల్వచేసుకొని వాటిని విద్యుత్‌శక్తిగా మార్చగలిగే యంత్ర పరికరాలు ఉంటే సౌర విద్యుత్‌ను గృహావసరాలు, పాఠశాలలు, పోలీసు స్టేషన్లు, ప్రభుత్వ, ప్రభుత్వేతర సంస్థలకు సోలార్ పరికరాలను ప్రభుత్వం రాయితీపై అందిస్తుంది. కాంతులు వెదజల్లే సూర్యుడే సౌర విద్యుత్ ఉత్పత్తి చేస్తుంది. సోలార్ ప్యానెల్‌లోని పోటోవోల్టాయిక్ సెల్స్ వెలుతురును ఎలక్ట్రానిక్‌లుగా మార్చి తద్వారా విద్యుత్ శక్తిగా రూపాంతరం చేస్తాయి. సౌర విద్యుత్‌తో పర్యావరణకు ఎలాంటి నష్టం జరగదు. ఇళ్లపై కప్పులో సోలార్ ప్యానెళ్లు ఏర్పాటు చేసుకుని విద్యుత్ ఉత్పత్తి చేసుకోవచ్చు. విద్యుత్ బిల్లుకు అయ్యే ఖర్చులు చాలా తగ్గుతాయి. గృహ అవసరాలకు పోను మిగులు విద్యుత్ గ్రిడ్‌కు సరఫరా కావడం ద్వారా అదనపు ఆదాయాన్ని పొందవచ్చు. తెలంగాణ రాష్ట్ర పునరుద్ధరణీయ ఇంధన వనరుల అభివృద్ధి సంస్థ (టీఎస్ రెడ్‌కో) ద్వారా ప్రభుత్వం సోలార్ విద్యుత్‌కు రాయితీని అందిస్తోంది.

రాయితీ, ఖర్చు వివరాలు...(రూ.లలో)

సామర్థ్యం కిలోవాట్స్	మొత్తం ఖర్చు - రాయితీ	దరఖాస్తు సొమ్ము	నెట్‌మీటర్ ధర	వినియోగదారుడు చెల్లించాల్సింది
1కిలో వాట్	52,000-18,000	1,180	2,950	37,330
2కిలో వాట్	97,800-34,400	2,360	2,950	68,710
3కిలో వాట్	1,43,100-50,400	3,540	2,950	99,140
4కిలో వాట్	1,86,400-57,400	4,720	2,950	1,36,670
5కిలోవాట్	2,33,000-65,600	5,900	2,950	1,76,250
6కిలోవాట్	2,79,600-73,800	7,080	2,950	2,15,830
7కిలో వాట్	3,26,200-82,000	8,260	2,950	2,55,410
8కిలోవాట్	3,72,800-90,200	9,440	2,950	2,94,990
9కిలోవాట్	4,19,400-98,400	10,620	2,950	3,34,570
10కిలోవాట్	4,66,000-1,06,600	11,800	2,950	3,74,150

సోలార్‌తో ఖర్చులు తగ్గించుకోవచ్చు



గృహ విద్యుత్ వినియోగదారులకు సోలార్ విద్యుత్ వినియోగం ద్వారా బిల్లుల ఖర్చులు తగ్గించుకోవచ్చు. నెట్ మీటరింగ్ ద్వారా ప్రభుత్వం రాయితీని అందిస్తోంది. సౌర విద్యుత్ ద్వారా కరెంటు బిల్లులు తప్పుతాయి. ప్రభుత్వం అందిస్తున్న రాయితీని వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

- మహేందర్‌రెడ్డి, రెడ్‌కో ఉమ్మడి వరంగల్ జిల్లా మేనేజర్

ఐలోని మల్లికార్జునస్వామి జాతరకు రండి

- సీఎం కేసీఆర్‌ను ఆహ్వానించిన ఎమ్మెల్యే అరూరి రమేష్

ఐనవోలు: శతాబ్దాల చరిత్ర కలిగి, ప్రఖ్యాత శైవక్షేత్రంగా విరాజిల్లుతున్న ఐనవోలు శ్రీమల్లికార్జున స్వామి ఆలయానికి సంక్రాంతి నుంచి ప్రారంభమయ్యే జాతర బ్రహ్మోత్సవాల్లో పాల్గొనాలని సీఎం కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావును వరంగల్ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, వర్ధన్నపేట ఎమ్మెల్యే అరూరి రమేష్, ఆలయంలో పెద్దరథం నిర్వాహకుడు, డీసీసీబీ చైర్మన్ మార్నేని రవీందర్‌రావులు ఆహ్వానించారు. సోమవారం ఎమ్మెల్యే ఆధ్వర్యంలో ప్రగతిభవన్‌లో సీఎం కేసీఆర్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ నెల 13 నుంచి జాతర బ్రహ్మోత్సవాలు జరుగనున్నట్లు సీఎంకు వివరించారు. గొల్ల కేతమ్మ, బలిజ మేడలమ్మలతో కూడిన శ్రీమల్లికార్జునస్వామి చిత్రపటంతో పాటు జాతర ఆహ్వానపత్రికను కేసీఆర్‌కు అందజేశారు. వేదపండితులు గట్టు పురుషోత్తమశర్మ, విక్రాంత్ వినాయక్ జోషిలు సీఎం కేసీఆర్‌కు వేదాశీర్వచనం చేయగా ఆలయ ప్రధాన అర్చకుడు పాతర్లపాటి రవీందర్, ముఖ్య అర్చకులు ఐనవోలు మధుకర్ శర్మలు స్వామి వారి శేషవస్త్రాలతో సత్కరించారు. ఎమ్మెల్యేతో కలిసి ఆలయ ఈఓ అద్దంకి నాగేశ్వర్‌రావు కేసీఆర్‌కు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా కేసీఆర్ ఆలయం నుంచి ముద్రించిన క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. అనంతరం ఆలయ అభివృద్ధికి ప్రత్యేక నిధులు కేటాయించాలని కోరుతూ మల్లన్న ఆలయ మాస్టర్‌ప్లాన్‌ను జతచేసి ఎమ్మెల్యే రమేష్ సీఎం కేసీఆర్‌కు వినతిపత్రం అందజేశారు. సానుకూలంగా స్పందించిన సీఎం కేసీఆర్ ఆలయ అభివృద్ధికి సహాయ సహకారాలు అందజేస్తానని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. సీఎంను కలిసిన వారిలో ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి, మాజీ స్పీకర్ సిరికొండ మధుసూదనాచారి, ఆలయ మాజీ చైర్మన్ మునిగాల సంపత్‌కుమార్, కిరణ్‌కుమార్, శ్రీకాంత్ ఉన్నారు.



సీఎంకు మల్లన్న చిత్రపటాన్ని బహూకరించి జాతరకు ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే అరూరి

కాపర్‌వైరు దొంగల అరెస్ట్

- అరెస్ట్ చేసి విచారించిన పోలీసులు
- నిందితుల నుంచి సొత్తు రికవరీ

ధర్మసాగర్ : వరంగల్ పోలీస్ కమిషనరేట్ పరిధిలోని గ్రామీణ ప్రాంతాల్లో గత 4 నెలలుగా విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లను ధ్వంసం చేసి అందులోని కాపర్‌వైరుని దొంగతనం చేసిన దొంగలను అరెస్ట్ చేసినట్లు సెంట్రల్ జోనల్ డీసీపీ ఎన్.అశోక్ కుమార్ తెలిపారు. ధర్మసాగర్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ఆయన తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్ దొంగతనం చేయడంతో గ్రామీణ ప్రాంత రైతులు కరెంట్ లేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దొంగలను పట్టుకొని రైతులకు న్యాయం చేయాలని సీపీ ఏవీ రంగనాథ్ ఆదేశాల మేరకు కాపర్ వైర్ దొంగతనాలను చాలెంజ్‌గా తీసుకున్నారు. కాజీపేట ఏసీపీ పి.శ్రీనివాస్, ధర్మసాగర్, హసన్‌పర్తి, మడికొండ, సీఐలు రమేష్, నరేందర్, వేణు, ధర్మసాగర్ ఎస్సై ఆధ్వర్యంలో ఒక ప్రత్యేక టీమ్‌ను ఏర్పాటు చేసి వారికి దొంగతనాలను చేధించడానికి తగు సూచనలు చేసినట్లు తెలిపారు. ఆ సూచనల మేరకు ప్రత్యేక శ్రద్ధ కనబరిచి వివిధ రకాలుగా సాంకేతిక పరిజ్ఞానంతో ప్రత్యేక టీమ్ సమాచారాన్ని సేకరించి సోమవారం ఉదయం రాంపూర్ క్రాస్‌రోడ్ వద్ద ధర్మసాగర్ సీఐ రమేష్ సిబ్బందితో తనిఖీ చేపట్టారు. తనిఖీలో అనుమానాస్పదంగా నీరేటి రాకేష్, మోతె సారంగపాణి, క్లోం శివ, పొస్తం శ్రీకాంత్‌లు తెల్లని సంచుల్లో సుమారు 90 కిలోల కాపర్‌వైరుని ట్రాలీలో తీసుకెళ్తుండగా వారిని పట్టుకొని విచారించినట్లు పేర్కొన్నారు. ఈ విచారణలో కాపర్‌వైర్‌ని ఓఆర్ఆర్ రోడ్డ్‌కి దగ్గరలోని రాంపూర్, దేవన్నపేట, కోమటిపల్లి, మల్కాపూర్ గ్రామాల పరిధిలోని ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్‌వైర్‌ని చోరీ చేసి అమ్మేందుకు వెళ్తున్నామని చెప్పారని తెలిపారు. వారిని అదుపులోకి తీసుకొని విచారించగా వారితో పాటు మరో ఇద్దరు తూర్పాటి అరుణ్, గంధం పట్టాభి ఉన్నారన్నారు. వారి వద్ద కూడా ఉందని చెప్పగా వారి నుంచి 20 కిలోలు స్వాధీనపర్చుకొని అదుపులోకి తీసుకొని విచారించామన్నారు. వీరందరూ 11 పోలీస్‌స్టేషన్ల పరిధిలో 19సార్లు పలుచోట్ల 30 ట్రాన్స్‌ఫార్మర్లలోని కాపర్ వైర్ సుమారు 924 కిలోలు దొంగిలించామని చెప్పారు. దొంగిలించిన సొత్తును హనుమకొండ, వరంగల్‌కి చెందిన పాత ఇనుపసామాను కొనుగోలు చేసే వ్యక్తులైన తూర్పాటి సమ్మయ్య, ఊర సాంబ, బాషబోయిన పోశాలు, మోటమ్ రాజయ్య, చత్రాబోయిన చంద్రమౌళిలకు అమ్మినట్లు చెప్పారు. వారి నుంచి డబ్బులు తీసుకొని అందరూ పంచుకొని మందు తాగి, జల్సాలకు వాడుకున్నట్లు తెలిపారని వివరించారు. కొనుగోలు చేసిన వారి నుంచి 814 కిలోలు స్వాధీనపరుచుకున్నామన్నారు. మొత్తం కాపర్‌వైర్ 924 కిలోలు వాటి విలువ రూ.13.23 లక్షలు ఉంటుందన్నారు.

మీదికొండలో అరుదైన భైరవశిల్పం

- గుర్తించిన చరిత్ర పరిశోధకుడు రత్నాకర్‌రెడ్డి

స్టేషన్‌ఘన్‌పూర్ : జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్ మండలం మీదికొండలో నాలుగు చేతులు కలిగిన అరుదైన భైరవ శిల్పం ఉన్నట్లు చరిత్ర పరిశోధకుడు రెడ్డి రత్నాకర్‌రెడ్డి గుర్తించారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. నాలుగు బాహువులు కలిగి ఒక చేతిలో బిచువా అనే కత్తి లాంటి ఆయుధం ధరించిన భైరవశిల్పం గ్రామంలో లభించిందని పేర్కొన్నారు. బిచువా అంటే హిందీలో తేలు కుట్టడమనే అర్థం. ఇది తేలు కొండిని పోలి ఉండడం వల్లే ఆ పేరు వచ్చిందని చెప్పారు. బిచువా 20వ శతాబ్దం వరకు అలంకార బాకుగా కొనసాగిందని, ఇతర దేవతా మూర్తుల చేతుల్లోనూ ఈ ఆయుధం కనిపించడం విశేషమన్నారు. జిల్లా అంతటా ఇనుమును సంగ్రహించిన ప్రాంతాలు, ఆయుధాల తయారీలో వృథాగా మిగిలిన చిట్టెం రాళ్ల గడ్డలు ఉన్నాయని పేర్కొన్నారు. కోల్కొండ మండల కేంద్రానికి కిలోమీటరు దూరంలో 200కి పైగా రాక్షసగుళ్లు ఉన్నాయని, వీటికి దగ్గరలో 50 ఎకరాల దిబ్బ ఉందని వివరించారు. పురావస్తు శాఖ తవ్వకాలు చేపట్టగా నవీన శిలాయుగానికి చెందిన 'కంచు ఉలి' దొరికిందని చరిత్ర పుస్తకాల్లో కనిపిస్తుందన్నారు. భైరవశిల్పాన్ని ప్రస్తుతం హనుమకొండ పురావస్తు మ్యూజియంలో భద్రపరిచారని తెలిపారు. చారిత్రక ఆధారాలను జనగామ ప్రజలకు అందుబాటులోకి తేవడానికి జిల్లాలో మ్యూజియం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు.



నాలుగు చేతులతో ఒక చేతిలో బిచువాతో ఉన్న భైరవ శిల్పం



భైరవ శిల్పం చేతిలో ఉన్న బిచువా ఆయుధం

'శ్రీ చైతన్య' ఘటనలపై విచారణ చేపట్టాలి

- యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

హన్మకొండ: రాష్ట్రంలోని కార్పొరేట్ శ్రీ చైతన్య విద్యాసంస్థల్లో విద్యార్థులపై జరిగే ఘటనలపై సీబీఐతో రాష్ట్ర ప్రభుత్వం విచారణ చేపట్టాలని, వెంటనే విద్యాసంస్థల యాజమాన్యాన్ని అరెస్టు చేయాలని యునైటెడ్ స్టూడెంట్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా రాష్ట్ర కార్యదర్శి మాదం తిరుపతి డిమాండ్ చేశారు. ఖమ్మం జిల్లాలో శ్రీ చైతన్య విద్యాసంస్థలో విద్యార్థిని చైతన్య ఆత్మహత్యయత్నానికి పాల్పడడాన్ని నిరసిస్తూ సోమవారం హనుమకొండలోని అంబేడ్కర్ కూడలిలో యూఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో యజమాన్యం దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా తిరుపతి మాట్లాడుతూ శ్రీ చైతన్య విద్యాసంస్థల ఆగడాలు రోజురోజుకు పెరిగిపోతున్నాయని, దీంతో విద్యార్థులు తల్లిదండ్రులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో యూఎస్ఎఫ్ఐ జిల్లా మాలోతురాజేష్ నాయక్, నాయకులు ప్రశాంత్, శ్రీనివాసులు, అరుణ్ కుమార్, మహేష్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఉదయం క్యాంటీన్ పని.. రాత్రి చోరీలు

- ఇద్దరిని అరెస్టు చేసిన రైల్వేపోలీసులు

కాశిబుగ్గ: కాజీపేట క్యాంటీన్‌లో పనిచేస్తూ రాత్రి వేళల్లో రైల్వే ప్రయాణికుల ఆభరణాలను దొంగిలిస్తున్న ఇద్దరినీ వరంగల్ జీఆర్‌పీ పోలీసులు అరెస్టు చేశారు. వారి నుంచి సుమారు రూ.3.50 లక్షల విలువైన బంగారు నగలను స్వాధీనం చేసుకున్నారు. వరంగల్ జీఆర్‌పీ సీఐ నరేష్ సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివ్వరాలు వెల్లడించారు. మధ్రప్రదేశ్ బింద్ జిల్లా చెందిన దీపక్‌సింగ్ రాజ్‌పుత్(22), ఉత్తర్‌ప్రదేశ్ సోనే కాపూర్‌కు చెందిన అతుల్‌సింగ్(23)లు క్యాంటీన్‌లో పనిచేస్తున్నారు. వీరు చెడు వ్యసనాలకు బానిసై పనిచేస్తే వస్తే వచ్చే డబ్బులు సరిపోక రాత్రి వేళల్లో రైళ్లలో నిద్రిస్తున్న మహిళలపై ఉన్న బంగారు ఆభరణాలను దోచుకుంటున్నారని సీఐ తెలిపారు. ప్రయాణికుల నుంచి వచ్చిన ఫిర్యాదు మేరకు కాజీపేట, వరంగల్ జీఆర్‌పీ, ఆర్‌పీఎఫ్ సిబ్బంది సంయుక్తంగా వరంగల్ రైల్వేస్టేషన్‌లోని రెండో ప్లాట్‌ఫారం ఫుట్ ఓవర్ బ్రిడ్జి వద్ద నిర్వహించిన తనిఖీల్లో అనుమానాస్పదంగా కనిపించడంతో వీరిని తనిఖీ చేయగా వారి నుంచి బంగారు పుస్తెల తాళ్లు, నల్లపూసలతాడు, బంగారు గొలుసు, పుస్తెలు లభించాయన్నారు. వాటిని స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు పంపినట్లు సీఐ తెలిపారు. ఈసమావేశంలో జీఆర్‌పి ఎస్ఐ పరశురాములు, రామకృష్ణ, రమేష్, రాము రియాజ్, రామకృష్ణ, రమేష్, మనోజ్‌కుమార్, రాజు, అనిల్‌లు పాల్గొన్నారు.



వివరాలు వెల్లడిస్తున్న వరంగల్ జీఆర్‌పీ సీఐ నరేష్

ఆన్‌లైన్‌గేమ్..

అధిక వడ్డీలే ప్రాణం తీశాయి

- బీటెక్ విద్యార్థికి కన్నీటి వీడ్కోలు



నజీర్‌గౌడ్ మృతదేహం

రఘునాథపల్లి: జనగామ జిల్లా రఘునాథపల్లి మండలంలోని ఎల్లారెడ్డిగూడెంలో బీటెక్ ఫైనలియర్ ఇంజనీరింగ్ విద్యార్థి బైరగోని నజీర్‌గౌడ్ (23) ఆత్మహత్యకు ఆన్‌లైన్‌గేమ్, అధిక వడ్డీలే పొట్టనబెట్టుకున్నట్లు పోలీసులు భావిస్తున్నారు. యశ్వంతాపూర్ క్రీస్తుజ్యోతి కళాశాలలో చదువుతున్న నజీర్‌గౌడ్ ఆదివారం ఇంట్లో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్న విషయం విదితమే. మృతుడి తండ్రి సత్యనారాయణ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. మృతుడి సెల్‌ఫోన్‌ను పోలీసులు పరిశీలించగా ఆన్‌లైన్‌లో క్రికెట్ బెట్టింగ్, తదితర గేమ్‌లు ఆడినట్లు గుర్తించారు. ఆన్‌లైన్ గేమ్స్ కోసం 10 శాతం వడ్డీతో అప్పు చేసి వేలాది రూపాయలు పోగొట్టుకున్నట్లు వాట్సాప్ చాటింగ్ ద్వారా స్పష్టమవుతుంది. ఇలా పోగొట్టుకున్న డబ్బులు స్నేహితులు, ఇతరుల వద్ద అప్పుగా తీసుకున్నాడు. అప్పు ఇచ్చిన వ్యక్తులు వడ్డీ డబ్బులు ఇవ్వాలని వాట్సాప్ ద్వారా ఒత్తిడి చేసినట్లు తెలుస్తోంది. దీంతో మానసిక ఒత్తిడికిలోనై నజీర్‌గౌడ్ ఆత్మహత్య చేసుకున్నట్లు పోలీసులు తెలిపారు.

లేచిరా నాన్నా అంటూ తల్లిదండ్రుల రోదన

నాన్నా ఒక్కసారి లేవరా అంటూ వారు రోదించిన తీరు పలువురి హృదయాలను బరువెక్కించింది. సోమవారం జనగామ ఏరియా ఆసుపత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం చేసి స్వగ్రామంలో అంత్యక్రియలు నిర్వహించారు. స్నేహితులు, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని నజీర్‌గౌడ్‌కు కన్నీటి వీడ్కోలు పలికారు.

త్వరలో వందేభారత్ రైళ్లు


- రైళ్ల కోసం ట్రాక్ పటిష్టం
- 130 స్పీడ్ పెంచేందుకు శ్రీకారం

కాజీపేట రూరల్ : దక్షిణ మధ్య రైల్వే సికింద్రాబాద్ జోన్ పరిధిలోని సికింద్రాబాద్–కాజీపేట మీదుగా బల్లార్షా, విజయవాడ, కరీంనగర్ తదితర సెక్షన్‌లలో అప్‌అండ్ డౌన్ రూట్‌లలో వందేభారత్ రైళ్లు నడిపించేందుకు ఆయా సెక్షన్లలో రైల్వే ట్రాక్‌ను పటిష్టం చేయాలని రైల్వే ఉన్నతాధికారులు ఆయా సెక్షన్ల ఆఫీసర్లకు ఉత్తర్వులు జారీ చేసినట్లు సోమవారం రాత్రి తెలిపారు. బ్రాండ్ గేజ్ రైల్వే ట్రాక్ కిలోమీటర్ నంబర్ కిలోమీటర్ నంబర్ వరకు వేగం పెంచేందుకు అధికారులు టెక్నికల్‌పరంగా మ్యాన్ ఫవర్‌ను, టెక్నాలజీని వాడి ట్రాక్‌రూట్‌ను సమర్థవంతంగా చేసే పనిలో నిమగ్నమయ్యారు. త్వరలో సికింద్రాబాద్ నుంచి కాజీపేట మీదుగా బల్లార్షా రూట్‌లో, వరంగల్ మీదుగా విజయవాడ రూట్‌లో వందేభారత్ రైళ్లను నడిపించేందుకు 130 కేఎంపీహెచ్ ట్రాక్‌పై వేగాన్ని సిద్ధం చేస్తున్నట్లు రైల్వే ఇంజనీరింగ్ అధికారులు తెలిపారు.

మహిళ ఆత్మహత్యాయత్నం..

- మంటలంటుకుని పేలిన గ్యాస్ సిలిండర్
- ఆమెతోపాటు రక్షించడానికి వెళ్లిన మరో ముగ్గురికి గాయాలు
- జనగామ జిల్లాలో ఘటన

స్టేషన్‌ఘన్‌పూర్: కుటుంబ కలహాలతో ఓ వివాహిత ఒంటిపై కిరోసిన్‌పోసుకుని నిప్పంటించుకుంది. ఆ మంటలు గ్యాస్ సిలిండర్‌కు అంటుకుని పేలింది. వివాహితతోపాటు ఆమెను కాపాడబోయిన మరో ముగ్గురికి గాయాలయ్యాయి. ఈ ఘటన జనగామ జిల్లా స్టేషన్‌ఘన్‌పూర్‌లో సోమవారం రాత్రి జరిగింది. వివరాల్లోకి వెళ్తే.. స్థానిక ప్రభుత్వ ఆస్పత్రి సమీపంలో నివాసం ఉంటున్న పిట్టల మధు, జ్యోత్స్న(35)లకు ఇద్దరు సంతానం. పదేళ్ల కుమారుడు సోషల్ వెల్ఫేర్ స్కూల్ హాస్టల్‌లో ఉంటుండగా, పదిహేనేళ్ల కుమార్తె తల్లిదండ్రులతో ఉంటుంది. దంపతుల మధ్య కొన్నిరోజులుగా గొడవలు జరుగుతున్నాయి. మధు మూడు రోజుల క్రితం భార్యతో గొడవ పడి ఇంట్లోనుంచి వెళ్లిపోయాడు. దీంతో మనస్తాపానికి గురైన జ్యోత్స్న సోమవారం రాత్రి ఇంట్లో ఒంటిపై కిరోసిన్ పోసుకుని నిప్పంటించుకుంది. పక్కనే ఉన్న గ్యాస్ సిలిండర్‌కు అంటుకుని పెద్దఎత్తున మంటలు వ్యాపించాయి. గమనించిన పొరుగింటి వారైన కుంభం రాజు, కుంభం శశితోపాటు నీల వెంకటమ్మలు జ్యోత్స్నను కాపాడేందుకు ప్రయత్నించారు. ఈ క్రమంలో వీరికి కూడా మంటలు అంటుకుని గాయాలయ్యాయి. స్థానిక గ్రామ పంచాయతీ ట్యాంకర్‌తో నీళ్లు తెప్పించి మంటలు ఆర్పే ప్రయత్నం చేశారు. ఏసీపీ రఘుచందర్, సీఐ రాఘవేందర్ సంఘటనా స్థలానికి చేరుకుని వివాహితతోపాటు మిగిలిన ముగ్గురు క్షతగాత్రులను చికిత్స నిమిత్తం మొదట స్థానిక ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. జ్యోత్స్న 60శాతానికి పైగా కాలినట్లు వైద్య సిబ్బంది తెలిపారు. అనంతరం నలుగురిని మెరుగైన చికిత్స కోసం వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.



ఇంట్లో చెలరేగుతున్న మంటలు



సహాయక చర్యలు చేపడుతున్న పోలీస్ సిబ్బంది

కాజీపేట రైల్వే వ్యాగన్ షెడ్ నిర్మాణానికి సన్నాహాలు

- వర్చువల్‌లో ప్రధాని శంకుస్థాపన చేసే అవకాశం

కాజీపేట రూరల్ : ఈ నెల 19న హైదరాబాద్ పర్యటనకు వస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోదితో కాజీపేట రైల్వేవ్యాగన్ పిరాడికల్ ఓవరాలింగ్ షెడ్ నిర్మాణ పనుల శంకుస్థాపనకు దక్షిణమధ్య రైల్వే అధికారులు ఏర్పాట్లకు సన్నాహాలు చేస్తున్నట్లు సోమవారం రైల్వేవర్గాల ద్వారా తెలిసింది. ప్రధాని పర్యటనలో రూ.7 వేల కోట్ల ప్రాజెక్టు పనులకు శంకుస్థాపనతో పాటు పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేయనున్నట్లు అధికారులు తెలిపారు. కార్యక్రమంలో భాగంగా కాజీపేట రైల్వేవ్యాగన్ షెడ్‌ను రిమోట్ వర్చువల్‌లో శంకుస్థాపన చేసే అవకాశం ఉందని చేయనున్నట్లు తెలిపారు. కాజీపేట మండలం మడికొండ అయోధ్యపురం వద్ద 155 ఎకరాల విస్తీర్ణంలో రూ.386 కోట్లతో ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న వ్యాగన్‌షెడ్ నిర్మాణానికి సంబంధించి టెండర్ ప్రక్రియ పూర్తయి నిర్మాణ పనుల కోసం ఎదురు చూపులు సాగుతున్నాయి. సికింద్రాబాద్ రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారి చేస్తే అయోధ్యపురం వద్ద వ్యాగన్ షెడ్ నిర్మాణం చేపట్టనున్న స్థలంలో శంకుస్థాపనకు సంబంధించిన ఏర్పాట్లు పనులు ఫౌండేషన్ ఫలకం పనులను మంగళవారం నుంచి చేసే ఆలోచనలో ఉన్నట్లు స్థానిక అధికారులు తెలిపారు.